క్లుప్తంగా

పాఠశాలలు తనిఖీ చేసిన పర్యవేక్షణ కమిటీలు



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పర్యవేక్షణ కమిటీ తనిఖీలు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్వీ రవిసాగర్ నియమించిన పర్యవేక్షణ కమిటీలు శుక్రవారం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించాయి. విద్యార్థుల అబివృద్ధి కోసం పాఠశాలల్లో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అమలు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించి వీరు జిల్లా విద్యాశాఖాధికారికి రిపోర్టుల రూపంలో వివరాలు అందించనున్నారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు తీరును మెరుగుపరుస్తారని పర్యవేక్షణ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాచుపాము హతం



స్థానికుల చేతిలో హతమైన తాచుపాము

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం స్థానికుల చేతిలో ఒక భారీ తాచుపాము హతమయింది. గ్రామం నుంచి కూరాడ డ్రెయిన్ గట్టుమీదుగా డేగలపేట వెళ్లే రహదారిలో గొల్ల శ్రీను మకాం వద్ద సుమారు పది అడుగుల పొడవున్న తాచుపాము హల్‌చల్ చేసింది. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు కర్రలు, గడ్డపారల సహాయంతో పామును కొట్టి హతమార్చారు. ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా పాము సంచరిస్తుండటంతో చెరువుల వద్దకు పనికి వచ్చిన కూలీలు ప్రాణభయంతో పనులు మానేసి వెళ్లిపోతున్నారని స్థానికులు తెలిపారు. పాము హతమవటంతో వారు ఊపిరి పీల్చుకున్నారన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు పలువురి పరామర్శ

మండపేట: కాలి గాయంతో ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శుక్రవారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన పట్ల ఆదరాభిమానాలు చూపిస్తున్న ప్రజలకు ఎమ్మెల్యే వేగుళ్ల కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నుంచి కొద్ది రోజుల పాటు ఇంటి వద్ద అందుబాటులో ఉండనని, నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు.

అవయవదానానికి అంగీకార పత్రం



అవయవ దాన అంగీకార పత్రం చక్రికి అందజేస్తున్న వెన్నా సూర్యకాంతం

రామచంద్రపురం: పట్టణానికి చెందిన వెన్నా సూర్యకాంతం శుక్రవారం 71 వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా కాకినాడకు చెందిన బాదం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ డీవీ రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్‌కు తన మరణానంతరం అవయవ దానానికి, వైద్య శాస్త్ర పరిశోధనలకు తన భౌతిక కాయాన్ని ఇచ్చేందుకు అంగీకార పత్రాన్ని ద్రాక్షారామకు చెందిన నేత్రదాన, అవయవ దాన మోటివేటర్ కంచెర్ల చక్రధరరావు(చక్రి)కి అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

అల్లవరం: ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు యువత, విద్యార్థులు సహకరించాలని స్థానిక ఎస్సై శ్రీను నాయక్ కోరారు. ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో 'యువతా మేలుకో–భవిత మలుచుకో–డగ్స్ వదులుకో' అనే నినాదంతో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని భావి తరాలకు అందించడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థులకు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థులతో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మత్తు పదార్థులు తీసుకున్నా, విక్రయించినా టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బీవీసీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గడపగడపకూ సంక్షేమం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- అంద్రంగిలో గడప గడపకూ



అంద్రంగిలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



వెంటూరులో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కాజులూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని అంద్రంగిలో మంత్రి వేణుగోపాలకృష్ణ శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంద్రంగి శివారుపెదపాటిగరువులో మహిళలు హారతులిచ్చి మంత్రి వేణుగోపాలకృష్ణకు తదితర నాయకులు స్వాగతం పలికారు. వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏపీ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా మంత్రి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్ మంచి పథకాలను రూపొందించటమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలో సఫలీకృతులయ్యారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసీ సభ్యురాలు మట్టా వెంకటరమణమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సమనాశి సోమన్న, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, కేశన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు చెరువుగట్టుపేటలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వెంటూరు సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి రవికుమార్, రాష్ట్ర పోలీస్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి అనంతలక్ష్మితో కలిసి గ్రామంలో తోట పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దకే రేషన్, పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయా? వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వస్తున్నారా? అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇంటింటికీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణా పుల్లేష్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన పాలనకు పాటుపడాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పూర్తయిన జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథుల నియామకం



ఎమ్మెల్సీ తోటతో జేసీఎస్ మండపేట అర్బన్ మండల కన్వీనర్లు

మండపేట: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు పాటుపడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల (జేసీఎస్)కు పట్టణ, మండల కన్వీనర్లు నియామకం పూర్తయ్యింది. మండపేట అర్బన్ కన్వీనర్‌గా యరమాటి వెంకన్నబాబు, రూరల్ కన్వీనర్‌గా బందెల సాయిరాం, కపిలేశ్వరపురం మండల కన్వీనర్‌గా పాలింగి శ్రీను, రాయవరం మండల కన్వీనర్‌గా తమ్మలపూడి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వారిని ఎమ్మెల్సీ తోట అభినందించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వారికి దిశా నిర్దేశం చేశారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు సీఎం జగన్ చర్యలు

- వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఖాదర్



వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఖాదర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెలంపాలెం మసీదు కమిటీ

రామచంద్రపురం రూరల్: తన సుదీర్ఘ పాదయాత్రలో ముస్లింలకు వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతానని మాటిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం మండలం వెలంపాలెంలో షాబాజియా మసీదును ఆయన వక్ఫ్ బోర్డు సభ్యులతో కలసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా పేరున్న ముఖ్యమంత్రి ముస్లింల కోసం వక్ఫ్ బోర్డు ఆస్తులను రక్షించడానికి అనుగుణంగా వక్ఫ్ బోర్డులకు రాష్ట్ర, జిల్లా కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారన్నారు. గత 20 సంవత్సరాలు వక్ఫ్ బోర్డుకు జిల్లా కమిటీలు లేని దుస్థితి నుంచి ప్రస్తుతం కమిటీలను ఏర్పాటు చేసి వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందించారన్నారు. దీనికనుగుణంగా తాము జిల్లాలోని అన్ని మసీదులను, దర్గాలను సందర్శించి ముస్లింలను ఆ దిశగా చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. దేశంలోనే తెలుగు రాష్ట్రంలో 4 శాతం రిజర్వేషన్ ఇచ్చి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు దైవంగా మారారన్నారు. ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలుగా అండదండగా ఉన్నారన్నారు. మసీదు కమిటీ తమ మసీదుకు ఉన్న స్థలంలో షాపులు నిర్మించేందుకు నిధులు కావాలని కోరగా ఖాదర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి మహ్మద్ జాఫర్ హుస్సేన్, జిల్లా డైరెక్టర్లు ఎండీ అబ్దుల్ రబ్బానీ, యూనుస్ షరీఫ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, మసీదు కమిటీల అధ్యక్షులు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటను కలిసిన ఆలీఖాన్‌బాబా

మండపేట: షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాదగా కలిశారు. షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆలీఖాన్‌బాబా పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు పొడిగించింది. ఎమ్మె ల్సీ తోటను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

ద్రాక్షారామ నాటక కళాపరిషత్‌తో జమునకు ప్రత్యేక అనుబంధం



ద్రాక్షారామలో రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో మాట్లాడుతున్న జమున (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ప్రముఖ సినీనటి జమునకు ద్రాక్షారామ నాటక కళాపరిషత్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. నాగిరెడ్డి సత్యనారాయణ, శృంగారం వేంకట అప్పలాచార్యులు స్థాపించిన ద్రాక్షారామ నాటక కళాపరిషత్‌కు జమున గౌరవాధ్యక్షురాలిగా కొనసాగారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో ఆమె నాగిరెడ్డి, అప్పలాచార్యర్‌లను ఆంధ్రప్రదేశ్ రంగస్థల వృత్తి కళాకారుల ద్రాక్షారామ శాఖకు అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించి వారి ద్వారా ఈ ప్రాంత కళాకారులకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 1984లో నాగిరెడ్డి సినీనటిగా ఉన్న జమునను ఊరేగింపుగా తీసుకువచ్చి ఘనంగా సత్కరించారు. అదే వేదికపై జమున బుర్రకథ పితామహుడిగా పేరొందిన సీనియర్ నాజర్‌ను సత్కరించారు. 2010లో ద్రాక్షారామ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు జమున ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు తన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జమున మృతికి ద్రాక్షారామ నాటక కళాపరిషత్ ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సతీష్‌రావు, సినీనటి ద్రాక్షారామ సరోజ, ఉపాధ్యక్షుడు కొండ, కోశాధికారి వేమవరపు రాంబాబు సంతాపం తెలియజేశారు.

వృద్ధాప్యంలోనూ పడుచుపిల్లలా నృత్యం చేసేవారు: అప్పలాచార్యర్

రామచంద్రపురం రూరల్: ప్రముఖ సినీనటి, కళాభారతి, ప్రజానటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షురాలు జూలూరి జమునా మృతి తనను తీవ్ర ద్రిగ్భాంతికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి అప్పలాచార్యర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్యంలోనూ పడుచుపిల్లలా నృత్యం చేసే జమున మృతి చెందారంటే నమ్మశక్యంగా లేదన్నారు. 1979లో రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య ద్రాక్షారామ శాఖకు నాగిరెడ్డి సత్యనారాయణను అధ్యక్షుడిగా, తనను కార్యదర్శిగా నియమించి తమతో అత్యంత సన్నిహితంగా ఉండేవారన్నారు. ద్రాక్షారామలో వితరణ శీలి వీరవల్లి వెంకటరత్నం సుమారు 1000 గజాల స్థలం సమాఖ్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు దానపట్టా రాయడంతో తమ అనుబంధం మరింత పెరిగిందన్నారు. అప్పట్లో జమున కాంగ్రెస్ పార్టీలో చేరి వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఆమెకు వ్యక్తిగత సహాయకుడిగా 6 సంవత్సరాలు పనిచేశానన్నారు. విశాఖపట్నంలో జరిగిన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే కార్యవర్గం కొనసాగుతుందన్నారు. 1989లో రాజమండ్రి ఎంపీగా పోటీ చేసినప్పుడు కార్యాలయ సహాయకుడిగా చేదోడుగా ఉన్నానన్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. జమున కుమారుడు వంశీ, కుమార్తె స్రవంతిలకు ఓదార్పు కలగాలని కోరుకుంటున్నానన్నారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం



గొల్లపాలెంలో ఎన్‌సీసీ పరీక్ష కేంద్రంలో విద్యార్థుల డ్రిల్ పరిశీలిస్తున్న కల్నల్ శావన్ గౌడర్

కాజులూరు: విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఎంతగానో దోహదపడుతుందని 18వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ వి.శావన్ గౌడర్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఎన్‌సీసీ జేడీ, జేడబ్ల్యూ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం కమాండింగ్ అధికారి కల్నల్ వి.శావన్ గౌడర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దేశరక్షణా బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందన్నారు. ఎన్‌సీసీ మిలటరీ శిక్షణకు పునాది అన్నారు. డివిజన్‌లోని గొల్లపాలెం, వేలంగి హైస్కూల్‌లలో ఎన్‌సీసీ పరీక్ష కేంద్రాల నిర్వహణ జరుగుతుందని విద్యార్థులకు రాతపరీక్ష, డ్రిల్ టెస్ట్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్‌లపై పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హవల్దార్ ఎంఎ అజీజ్‌నాయక్, ఎన్‌సీసీ ఆఫీసర్లు జి.సునీల్‌కుమార్, బి.రాంబాబు, స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగంగా పూర్తి చేయాలి



పల్లిపాలెంలో రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ రమణ

కాజులూరు: జగనన్న శాశ్వత భూ హక్కురక్ష రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆర్డీవో రమణ పర్యటించి భూ రీ సర్వే కార్యక్రమాలను పరిశీలించారు. పల్లిపాలెంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ రెవెన్యూ డివిజన్లోని 121 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి 55 వేల 890 మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. డివిజన్‌లోని కాజులూరు మండలంలో 20 రెవెన్యూ గ్రామాలకు గానూ 19 గ్రామాల సర్వేకి సంబంధించి భూముల ఖచ్చితత్వం, విలువలు రీ సర్వే, రికార్డుల రూపొందించామన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ, ఆర్ఐ వేగేశ్వరరావు, సర్వేయర్లు, పలు గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టుకు శంకుస్థాపన



కల్వర్టులు, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: మండలంలోని దంగేరు పంచాయతీ పరిధిలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద నుంచి కొత్త కొంపలు వెళ్లే దారిలో రెండు నూతన కల్వర్టుల నిర్మాణానికి ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచనల మేరకు గెయిల్ ఇండియా సుమారు రూ.కోటి మంజూరు చేసిందన్నారు. కల్వర్టుల నిర్మాణంతో పాటు ఇదే దారిలో బీటీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టనున్నారని వారు పేర్కొన్నారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, పార్టీ నాయకులు పంపన సుబ్బారావు, ఓబులనేని రాజ్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు రథసప్తమి సందర్భంగా పుణ్యస్నానాలు

కపిలేశ్వరపురం: రథ సప్తమిని పురస్కరించుకుని శనివారం పుణ్య గౌతమి గోదావరి తీర ప్రాంతాలైన కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కర ఘాట్ల వద్ద మహిళలతో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇతర గ్రామాల వైష్ణవాలను భక్తులు సందర్శిస్తారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అరుణహోమాన్ని, సూర్య నమస్కారాలను ప్రదర్శిస్తారు. సామూహిక కుంకుమ పూజలు చేస్తారు. ఏడిదలోని సంఘమేశ్వర క్షేత్రంలో సూర్యనారాయణస్వామికి పంచామృతం, మందాల పువ్వులతో పూజలు చేస్తారు. రెండు నియోజకవర్గాల సమీపాన గల పెదపూడి మండలం జి.మామిడాడలో ఏటా నిర్వహించే శ్రీ సూర్యనారాయణస్వామి రథోత్సవానికి ఇక్కడి భక్తులు తరలి వెళ్తారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

మండపేట: ఒత్తిడిని అధిగమించడం ద్వారా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో కలిసి బీజేపీ నాయకులు టీవీలో తిలకించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బీజేపీ నాయకులు చుక్కల అప్పారావు, వెస్సా దుర్గా ప్రసాద్, తణుకు నరసింహమూర్తి, బుద్ధవరపు రాజు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు



ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: అసలే ఏటిగుట్ట ఇరుకుగా ఉంటుంది. దీనిపై కోట వద్ద ఉన్న వంతెన మరీ ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా ప్రమాదకర మలుపులతో ఏటిగట్టు రోడ్డు ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి– కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలలగా పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. కనీసం ఈ వంతెన వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడు బేకర్లు ఏర్పాటుతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ



కపిలేశ్వరపురంలో టీచర్ వీర్రాజును సత్కరిస్తున్న పెద్దలు

- సేవా పురస్కారాల గ్రహీతలకు సన్మానం

కపిలేశ్వరపురం: ప్రభుత్వ శాఖల విధి నిర్వహణే ఉద్యోగులు అందించన సేవలు మంచి గుర్తింపును ఇస్తాయని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. గణ తంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న మండలానికి చెందిన ఉద్యోగులను శుక్రవారం సహ ఉద్యోగులు సత్కరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అవార్డు గ్రహీతలైన పడమర ఖండ్రిక కార్యదర్శి ఐ.నాగార్జున, అద్దంకివారిలంక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మల్లాడి దేవి, రామచంద్రపురం డీఎల్పీఓ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ కపిలేశ్వరపురానికి చెందిన కె.వెంకటేశ్వరావుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎంవీ ప్రకాష్, కార్యదర్శులు, సహ ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న టీచర్‌కు..

పదోన్నతిపై వెళ్తున్న కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.వీర్రాజుని గ్రామస్తులు సత్కరించారు. పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం వైజీ మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సన్మానంలో ఉపాధ్యాయుడు వీర్రాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శీలం భాస్కరరావు, పీఎంసీ చైర్మన్ మసకపల్లి నాగూర్‌మీరా సాహెబ్, వార్డు సభ్యులు కేతని వెంకటలక్ష్మి, పెద్దలు పిప్పర సంపతరావు, ఆర్‌బీకే చైర్మన్ అనసూరి జయపాల్ కృష్ణ పాల్గొన్నారు.

నా చావుకు కారణం నా అన్న కొడుకే..

- అయిన వాళ్లు చేసిన మోసం తట్టుకోలేక
- రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య
- సెల్ఫీ వీడియోతో ఆలస్యంగా వెలుగులోకి



మృతుడు వీర్రాజు (ఫైల్)

మండపేట: నా చావుకి కారణం నా అన్నయ్య కొడుకేనంటూ ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నా వాళ్లని నమ్మి అప్పులు తెచ్చి వ్యాపారం చేస్తే నమ్మకం ద్రోహం చేశారని రోదిస్తూ ఆత్మహత్యకు ముందు అతను తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దుర్ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వై. సీతానగరం గ్రామానికి చెందిన కోటిపల్లి వీర్రాజు (49) మండపేట రావులపేటలో భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. గతంలో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేసేవాడు. కలిసి రాకపోవడంతో రెండేళ్ల క్రితం తన సోదరుడు ఏసుబాబు కుమారుడైన చక్రవర్తితో కలిసి మండపేట లారీ యూనియన్ ఆఫీసు వద్ద ఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించాడు. సోదరుడి కుమారుడ్ని నమ్మి తన వాటాగా అప్పులు చేసి దాదాపు రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్టు వీర్రాజు తెలిపాడు. గతంలో పలుమార్లు లెక్కలు తేల్చాలని చక్రవర్తిని కోరినా పట్టించుకునేవాడు కాదని, ఇప్పుడు పొంతన లేకుండా మాట్లాడుతూ తనను మోసగించాడని వాపోయాడు. బయట అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో వారి అప్పులు తీర్చేదారి లేక, అయిన వారు చేసిన మోసం తట్టుకోలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నాడు. తన సోదరుడు, అతడి కుమారుడి వద్ద నుంచి సొమ్ములు రాబట్టి తన భార్య పిల్లలు, తనకు అప్పులు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు. వారం రోజుల క్రితం కేశవరం రైల్వేగేటు సమీపాన ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. కాగా విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు వివరాలు బయటకు రానివ్వకుండా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనా స్థలంలో లభ్యమైన ఫోన్‌లోని సెల్ఫీ వీడియోలు బయటకు రావడంతో వీర్రాజు ఆత్మహత్యకు గల కారణాలు వెలుగు చూశాయి. ఈ విషయమై రూరల్ పోలీసులు కూపీ లాగుతున్నట్టు తెలిసింది. కాగా మండపేట రూరల్ ఎస్సై బి.శివకృష్ణను సంప్రదించగా ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఘనంగా అనంత పద్మనాభుని కల్యాణం

కపిలేశ్వరపురం: అంగరలోని అనంత పద్మనాభ స్వామి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి సన్నిధిలో వేద మంత్రోచ్చారణల మధ్య సాగిన దివ్యమూర్తుల కల్యాణాన్ని భక్తులు వీక్షించారు. కల్యాణ పూజలతో పాటు రామనామ సంకీర్తన, గీతాపారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.